# గుండం



పూసపాటి కృష్ణంరాజు

**చుక్కెల్లాయకు** ఇద్దరూ ఆడపిల్లలే!

పెద్దది ఎల్లయ్యమ్మ; రెండోది నూకాలు. ఎల్లయ్యమ్మను ఆమడ దూరంలో ఉన్న పాలగూరు పంచాయతీ మెంబరు చిలకల సత్యారావు కిచ్చి పెళ్లి చేసేరు. దాన్నోట్లో అక్షరం ముక్క లేకపోయినా సంసారం సజావుగానే సాగిపోతూంది.

చిన్నది నూకాలు థర్డ్ ఫారం చదివింది. మనువు కుదిర్చి పెళ్లి చేస్తానంటే ఒప్పిందికాదు. అప్పజెల్లెలు ఎల్లయ్యమ్మను చూడ్డానికని ఆ ఊరు వెళ్లింది.

వెళ్లిన నూకాలు మరి తిరిగి రాలేదు.

తిరిగి రాకపోవడానికి ఒక విధంగా అల్లుడు 'సత్తెరావే' కారణం!

ఎందుకంటే—

పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు రాజగోపాలరావుకు మరదల్ని పరిచయం చేశాడు.

నూకాల్ని చూసి రాజగోపాలరావు సరదా

*ఊరంతా ఏకగ్రీవంగా ఒప్పుకొన్నారు. అపసవ్యంగా చచ్చిపోయినట్లు రిజిస్టర్‌లో వ్రాసుకొన్నారు. అగ్గిపాలు చేశారు. గుండం కట్టించారు. పసుపు కుంకాలు చెల్లించారు. అలాంటి ఎల్లయ్యమ్మ ఇప్పుడు అందరి ఎదుటా నిలబడింది. ఆ గుండానికి ఏం పేరు పెట్టాలో ఎవరు చెప్పగలరు?*

పడ్డాడు. సరదాపడి పంచాయతీ పాలనలో ఉన్న బళ్లో పంతులమ్మ ఉద్యోగం వేయించాడు. ట్రెయినింగుకు పంపి రెండేళ్లలో మాకాలమ్మను పెద్దమేస్టరమ్మను చేస్తానన్నాడు.

సత్తేరావుకు ప్రెసిడెంటు ఎంతచెప్తే అంతే! చదువుకున్న మరదలు ఊళ్లో ఉద్యోగంచేస్తూ తనకు అండగా ఉంటుందని సంతోషపడ్డాడు.

సుక్కల్లాయి తరుచూ అల్లుడింటికొస్తూ పోతూ కూతుళ్లను చూసుకొంటూ మురిసి పోయేవాడు.

స్కూల్లో మేస్టరమ్మగా చేర్పించిన మాకాల్ని పైలా పచ్చీస్‌లో ఉన్న ప్రెసిడెంటు రాజగోపాలరావు వల్లో వేసుకున్నాడు. ఆ సంగతి సత్తేరావు కానుకోలేదు. సత్తేరావేకాదు, మగపిల్లల బళ్లో పంతులు ఉద్యోగం చేస్తూన్న జాన్‌కు తప్ప ఆ ఊళ్లో రెండో కంటివాడికీ విషయం తెలీదు.

జాన్‌కెలా తెలిసిందంటే—

అతను మాకాల్ని చూసిన తక్షణం ఆమెను ప్రేమించేడు కనుక. అలా ఎందుకు చేశాడంటే— అతనికి చూసిన ఆడపిల్లని సందర్భి ప్రేమించడం సరదా.

ప్రేమించింది లగాయతు, మాకాలు ఎటు వెళ్తున్నదీ, ఏం చేస్తున్నదీ పరిశీలనగా కని పెట్టి చూసి తెలుసుకొనే వాడు.

ఆ తెలుసుకోవడంలో—మాకాలూ, రాజగోపాలరావూ కలిసి సరుగుడుతోటలో చెట్టాపట్టాలు వేసుకోవడం కళ్లారా చూసేడు. చూసిన వాడు నోరు నొక్కుకున్నాడు. అయితే—

జాన్‌కు ఈ రహస్యం తెలిసిపోయినట్టు రాజగోపాలరావూ పసిగట్టేడు. పసిగట్టి అతనికి తగిన వ్యూహం పన్నుకొన్నాడు.

మాకాలికి సినిమాలన్నా, సినిమా హీరోలన్నా యిష్టం! అందుకే నల్లగా కర్రి మొద్దులా ఉన్న జాన్‌ని ప్రేమించలేకపోయింది. ఎర్రగా బుర్రగా హీరోలా ఉన్న ప్రెసిడెంటును ప్రేమించింది.

ప్రేమించి అతని వల్లో చిక్కుకు పోయింది. అతనేలా చెప్తే అలా నడుచుకొంటూ చెప్పిన దానికి తలూపేసింది.

ఏ వ్యవహారాన్నీ ముదరబెట్టడం రాజగోపాలరావుకు ఇష్టం ఉండదు.

జాన్ మేస్టర్ని స్వయంగా పిలిచి సంగతి తెలుసుకున్నాడు.

మొదట్లో జాన్, ప్రెసిడెంటుకు జడిసి నిజం చెప్పకపోయినా తరువాత అంతా తెలుసునని ఒప్పేసుకున్నాడు.

రాజగోపాలరావు జాన్ భుజం మీద చెయ్యి వేసి, "నాకో సహాయం చెయ్యగలవా?" అని అడిగేడు.

"తమ కెదురేమిటి! నూతిలో దూకమంటే దూకుతాను."

"నూతిలో దూకొద్దుగాని, మాకాల్ని తీసుకొని లేచిపోవాలి. ఆ పనిచేస్తావా?"

"లేచి పోవడానికి మాకాలు నాతో వస్తుందా? తమరేదో హాస్యానికి సెలవిస్తు[illegible]!"

"హాస్యానికాదు. నిజంగానే చెబుతున్నాను. దానిమీద నాకు మోజు తీరిపోయింది. ఇదిలా సాగుతే ఎప్పుడో ఒకనాడు ఊళ్లో నా పరువు గంగపాలవుతుంది. నా మాట విను. మాకాలికి యిప్పుడు నేనెంత చెబితే అంతే! ఇక్కణ్నుంచి దాన్ని నీతో పంపే పూచీ నాది. ఆ తరువాత నువ్వు చూసుకో."

"తమ సెలవుకడ్డుచెప్పను కాని..."

"నీ కేమీ అనుమానం అక్కర్లేదు. నేనొచ్చి మిమ్మల్ని కలుసుకుంటానని మాకాలికి నచ్చచెప్పి పంపిస్తాను. సినిమాలో వేషం అని చెప్తే వింటుంది. ఇదిగో ఈ ఐదు వందలూ దారి ఖర్చులికి దగ్గరుంచుకో" అని రాజగోపాలరావు నోట్లకట్ట జాన్ చేతిలో పెట్టేడు.

"మాకాల్ని నాతో రావడాని కొప్పించండి. మిగతా సంగతి నే న్జూసుకొంటాన్లెండి" అని జాన్ మేస్టరు రూపాయలు భద్రంగా పేంటు జేబులో పెట్టుకున్నాడు.

రాజగోపాలరావు మాకాల్ని రహస్యంగా కలుసుకొని విషయం చెప్పేడు.

"జాన్ మేస్టరుతో కలిసి నువ్వు రేపురాత్రి రైలెక్కి చెన్నపట్నం వెళ్లిపో. అక్కడో డైరెక్టర్ గారిని నీకు మంచి పసందైన వేషం ఇవ్వమని ఉత్తరం రాసిచ్చాను. నేను వారం రోజుల్లో అక్కడికొచ్చి మిమ్మల్ని కలుసుకొంటాన్లే" అని బోధపర్చేడు.

మాకాలు ఎదురు చెప్పలేదు.

రాజగోపాలరావు సమస్య తీరిపోయింది.

మాకాలు వెనకా ముందూ ఆలోచించలేదు.

## విజ్ఞప్తి

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం కథలు, గేయాలు, ఫోటోలు, చిత్రాలు మున్నగునవి పంపేవారు పేరు, పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. ప్రచురణకు అంగీకరించే పక్షంలో ఆ సంగతి తెలియ పరచడము, ప్రచురణార్హం కాక పోతే త్రిప్పి పంపడము దుస్తరం అవుతున్న కారణంచేత ప్రత్యేకంగా ఈ విజ్ఞప్తి చేస్తున్నాము.*

—ఎడిటర్

కన్న తండ్రినీ, అప్పజెల్లెల్నీ, సత్తేరావు బావని, ప్రెసిడెంటునీ, పంచాయతీబోర్డు ఆడపిల్లల బడినీ, ఊర్నీ, ఊళ్లో ఉన్న యావన్మందినీ వదిలేసి మాస్టరు జాన్‌తో కలిసి లేచిపోయింది.

లేచిపోయిందన్న సంగతి ఆ రెండు గ్రామాల్లోనూ ప్రతి ఒక్కరికీ తెలుసు.

ఎందుకు లేచిపోయిందో, లేచిపోయి ఎక్కడికి వెళ్లిందో ప్రెసిడెంటు రాజగోపాలరావుకు తప్ప మరో కంటివాడికి తెలీలేదు.

"లేచిపోయినదాన్ని యింకా వెతికి తీసుకొచ్చి యింట్లో ఎట్టుకుంటానా!" అని సిలకల సత్తేరావు మరదలుకోసం వెతకలేదు.

మామగారు కూతురుకోసం బెంగపెట్టుకున్నా, "చస్తే చావాలిగాని దాన్నెతకడానికెళ్లే" దన్నాడు.

పెళ్లాం ఎల్లయ్యమ్మ చెల్లెలికోసం ఎంత గోలపెట్టినా ఖాతరే చెయ్యలేదు.

సుక్కల్లాయకు అల్లుడు సత్తేరావు మాట వినక తప్పలేదు. పెద్దకూతురన్నా సుఖంగా బతుకుతే చాలునుకున్నాడు. కూతుర్ని ఓదార్చి యింటికెళ్లాడు.

ఆ రోజు కారోజు బహిరంగంగా రామకోవెల అరుగుమీద, రజకవీధి పంచాయతీ మెంబరు తిప్పడు, ప్రెసిడెంటు పార్టీ మెంబరు సత్తేరావును నిలేసి, నీ ఆలి తోడబుట్టింది ఫలానావాడితో లేచిపోయిందని మాటమీద మాట పెంచి ఎత్తిపొడిచేడు.

ఆ మట్న సత్తేరావు ఎక్కడలేని పౌరుషంతో అగ్గిపిడుగై పోయి ఇంటికొచ్చాడు.

ఇంట్లోవున్న పెళ్లాన్ని శ్రీరాములవారు సీతాదేవిని వనవాసానికి పంపినట్టు గౌరవంగా మర్యాదగా పంపలేదు.

"నీకుటుంబమంతా నీతిలేని పుట్టుక. అదా జాన్‌గాడితో ఎల్లిపోవడానికి నువ్వే కారణం. దాని కలుపిచ్చేసినావు. నీకు నీతీ నిజాయితీ లేదు. నిన్ను కట్టుకున్నందుకు ఆ చాకలి తిప్పడికిద్దై పోవాను. నువ్వూ నీ సెల్లెమ్మలాగ ఎవుణ్నన్నా తగులుకుపోతావు గావాల ఫో—

"నాయింట్లో ఒక్క సిటం వుండడానికీల్లేదు" అని కట్టుకున్నదాని కొప్పుచ్చుకొని బర బర వీధిలోకి లాక్కొచ్చి వదిలీశాడు.

"మరదలుపిల్ల తప్పుచేస్తే పెళ్లాన్ని కొట్టుకొంటావా!" అని వీధిలో నలుగురూ అడ్డుకొన్నా ఆగలేదు.

"పంచాయతీ మెంబరువి, నువ్వే యిలా చేస్తే ఎలారా" అన్నా వినలేదు.

సీతమ్మవారిలాగ ఎల్లయ్యమ్మ మొగుణ్ణి

పల్లెత్తు మాటనలేకపోయింది.

నడివీధిలో పడిపోయింది.

"చీకట్లో సిందులాటెందుకు? తెల్లారిలేస్తే ఆడికోపం దిగిపోద్ది. ఆడుట్టి పత్తెకాలం మనిషి. ఆడే ఏలుకుంటాడ్లే. అందాకా మాయింటికిరా" అని ఇరుగూ పొరుగూ చెవినిల్లు గట్టుకొని ఎంత చెప్పినా ఎల్లయ్యమ్మ తలొగ్గలేదు.

ఆ నడివీధిలో విడిపోయిన జుత్తు ముడన్నా వెయ్యకుండా అలా కూర్చుని కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది.

ఎల్లయ్యమ్మ ఎంతఏడిచి మొత్తుకొన్నా పత్తేరావు యింట్లో తలుపులు బిగించి పడుకొన్నాడు గాని లేవలేదు.

రాత్రి నెత్తికెక్కిపోయింది.

చీకట్లో అందరికళ్లూ కప్పబడిపోయాయి.

మాకాలు కూర్చున్న దగ్గిరినుండి ఎప్పుడులేచి వెళ్లిపోయిందో, ఎటు వెళ్లిపోయిందో ఎవరూ చూడలేదు.

పొరుగింటి పుల్లమ్మ, ఎల్లయ్యమ్మ ఆజాగాలో లేకపోవడం గుర్తించి పత్తేరావేసుకొన్న తలుపులు గుద్ది, "నీపెళ్లాం ఎటో వెళ్లిపోయింది లేరా" అని చెప్పింది.

"పోతే పొమ్మను" అని తిట్టుకొంటూ వెచ్చగా తొంగున్నాడు గాని లేచి తలుపులు తెరవలేదు.

తెల్లవారిపోయింది.

తెల్లవారడంతోనే అందరికీ ఉప్పంది పోయింది.

తెలగావీధి పంచాయతీ మెంబరు పిలకల పత్తేరావును అతని భార్య ఎల్లయ్యమ్మ విడిచి పెట్టేసిందన్న 'టాకు' ఊరందరి చెవిలోనూ పడిపోయింది.

పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు రాజగోపాలరావు తన పార్టీ మెంబరు పత్తేరావింటికొచ్చి విషయం తెలుసుకున్నాడు.

పత్తేరావును "ఒట్టి అవివేకి" అని పెద్ద మనిషి తరహాగా తిట్టి మందలించేడు.

రాజగోపాలరావును చూడగానే పత్తేరావుకు పట్టిన పూనకం దిగిపోయింది. పెళ్లాన్ని నిష్కారణంగా దండించినందుకు ప్రెసిడెంటు ముందు సిగ్గుపడిపోయాడు.

పెళ్లాంమీద జాలివేసుకొచ్చింది. బయల్దేరి ఊరూ వాడా తిరిగి పెళ్లాన్ని వెతికేడు.

ఎల్లయ్యమ్మ జాడ కనిపించలేదు.

పుట్టింటికి వెళ్లిందేమోనని పత్తేరావు పెళ్లాన్ని వెదుక్కొంటూ అత్తారింటికి వెళ్లేడు.

ఎల్లయ్యమ్మ కన్నవారింటికీ చేరలేదు.

అల్లుడు పత్తేరావు రాకవల్ల విషయం అంతా తెలుసుకున్న మామగారు గుండెలు బాదుకొన్నాడు.

చిన్నకూతురు ఎవడితోనో లేచిపోయింది. పెద్దదాని సంసారమన్నా స్థిరంగా ఉంటుందేమో అనుకొంటే యిప్పుడీ అర్ధాంతరం దాపురించింది. ముసలాయన తట్టుకోలేకపోయాడు. చెదిరి పోయిన గుండెతో రోగం తెచ్చుకొని మంచం పట్టేశాడు.

పత్తేరావుకు తిరిగి యింటికి వెళ్లి ఊళ్లో నలుగురికీ ముఖం చూపించడానికి చెల్లింది కాదు.

'మెంబరు పెళ్లాం మెంబర్నొగ్గిసిందంటే ఊళ్లో తలెత్తుకెలా తిరగడం! దీన్నెతికి పట్టుకోవాల' అని చుట్టాలున్న ఊళ్లన్నీ వెదపొయ్యడం మొదలు పెట్టేడు. వారం పది రోజుల్లై పోయినా దాని అయిపు పత్తేరావుకు దొరకలేదు.

పల్లెలూ, పట్నాలూ, తోటలూ, దొడ్లూ, మాతులూ, గోతులూ గాలించి వెతుకుతున్నాడు. కనిపించిన ప్రతివాణ్ణీ నిలేసి, "నా పెళ్లాం కనిపించిందా" అని ప్రశ్నలు వేస్తున్నాడు.

ఊళ్లో ఏనోట విన్నా తెలగావీధి వార్డు మెంబరు పత్తేరావింటి గొడవే. విక్షేపం వంటి సంసారం నిప్పుల పాలయింది. చెట్టుకోపిట్టయి తిరుగుతున్నారు.

మాకాళ్ని జాన్ మేష్టరు చెప్పినట్టుం టీమకెల్లి సినిమాల్లో హీరోయిన్ని చెయ్యలేదు. కనీసం ఎక్స్ట్రా వేషం అయినా ప్రయత్నించలేదు. స్టూడియో ముఖం కూడా చూపించలేదు.

పట్నానికి దూరంగా పల్లవరంలో ఓ కొంప అద్దెకు తీసుకొని కాపరం పెట్టేడు. మాకాళ్ని నాలుగు విధాలా భయపెట్టి వాంఛలన్నీ తీర్చు



ఆటోమటిక్ 50 తోటాల పిస్టల్



అమెరికన్ మోడల్. 50 తోటాలకు విడిగా డయల్. పెద్దధ్వని. నిప్పురవ్వలులేచి దొంగలను భయపెట్టును. లైసెన్సు అవసరంలేదు. డ్రామాలకు మంచిది. ధర రు. 10.50 నయాపైసలు. పోస్టేజి రు.2—50 న.పై. పిస్టలుతో 50 తోటాలు ఉచితం. తోలుకేసు రు. 4/— అదనం. తోటాలు 100 రు. 5/—

ILFA Book Depot (AW)
RAFATGANJ. ALIGARH (U.P.)

అన్ని పళ్ల వ్యాధులకు పుప్పి పళ్లకు ప్రత్యేకంగా తయారు చేసిన ఆయుర్వేదౌషధం




ఉపయోగించండి.

సర్వ్ వెల్ సరకులకు

డిస్ట్రిబ్యూటర్సు, ఏజంట్లు కావలెను.
షీలా ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్, టూత్ పౌడర్, డీలక్స్ చాకొలేట్స్ తయారు చేసే సంస్థ.
ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో మాత్రమే.
పోస్ట్ బాక్స్ నంబరు 169.
మంగళూరు — 1. (దక్షిణకనరా)

## గుండం

కొన్నాడు. డబ్బు, డబ్బుతోపాటు పరదాలు తీరిపోయినాయి. మాకాల్ని తేనాంపేటలో రంగమ్మ డిపోకు అమ్మేశాడు. రంగమ్మడిపోలో పెద్ద పెద్ద ఎస్టేట్లలో ప్రతి సంవత్సరం కూర్లు మారిపోతున్నట్టు, పిల్లలు మారిపోతారు. కొత్త పిట్టల్నిఎప్పటి కప్పుడుకొని వ్యాపారం మూడు పువ్వుల్ని ఆరు కాయలు కాపిస్తూంది. వచ్చిన ఆడదాన్ని లొంగదీసుకొని వ్యాపారంలో పెట్టడానికి కావలసిన సులువులన్నీ దానికి బాగా తెలుసు.

జాన్, జాన్‌కంటె ముందు రాజగోపాలరావూ వేసిన సొలెగూట్లో గిలగిల కొట్టుకున్న మాకాలు, రంగమ్మ పన్నిన యినుపపంజరంలో పడి రోజా నలిగిపోతూంది.

పిచ్చెత్తినట్టు రోడ్ల వెంబడి తిరుగుతూన్న సత్తేరావు నగరం నడిబొడ్డున ఉన్న గంట స్తంభం దగ్గర రాజగోపాలరావు కంటబడ్డాడు.

కార్లో వెడుతూన్న వాడు సత్తేరావును చూసి కారాపి దిగివచ్చి అతని కుడిభుజం పట్టుకున్నాడు. వెర్రివాళ్లా చూస్తున్న సత్తేరావును కారెక్కించి మచ్చిక చేసేడు.

అలా బెంబేలెత్తి రోడ్ల వెంబడి తిరుగుతే లాభం లేదన్నాడు. పేపర్లో ప్రకటన వేయించి ఎల్లయ్యమ్మను ఎక్కడఉన్నదీ ఆరా తీయిస్తానని నచ్చ జెప్పేడు.

సత్తేరావు ప్రెసిడెంటును చూడగానే పిల్లిలా మెత్తబడిపోయేడు.

ప్రెసిడెంటు రాజగోపాలరావు కారు పట్నం వదిలి పల్లెటూరి వైపు పంచాయతీ బోర్డు కొత్తగా వేసిన రోడ్డు మీద తాజాగా దొర్లు కొంటూ పరుగెత్తింది.

జిరాయితీ గ్రామాని కంతటికీ హాపీ అయిన పెద్ద చెరువు తామరతోనూ నాచుతోనూ నిండి పోయింది. అరగట్లో మొల్లోతు రెల్లిగడ్డి పెరిగి పోయింది. ఆ గడ్డి దుబ్బుల మధ్య నీటిపాయల్లో గంటావాడు పశువుల్ని దిగ్గొట్టి కడుగుతూండగా కుళ్లి పోయిన శవం కంపు కొడుతూ కనిపించింది. ఎక్కడ పశువు లక్కడ వదిలేసి బేజారైపోయి గంటావాడు ఊళ్లో కొచ్చి పడ్డాడు.

పెద్ద చెరువులో శవం తేలిందంటే తేలిందన్న వార్త ఆ ఊళ్లో యింటింటా పాక్కపోయింది. ఊరంతా చెరువు గట్టుకు విరగబడ్డారు. కాకులకూ గెద్దలకూ రాబందులకూ అందకుండా, నీట్లో ఉబ్బిపోయి చివికి పోయిన ఆడశవాన్ని అంతా కలిసి బయటికి తీసేరు.

పెద్ద చెరువు గట్టు మీద తండోపతండాలుగా ఉన్న జనాన్ని అల్లంతదూరం నుంచి చూసిన ప్రెసిడెంటుకూ, సత్తేరావుకూ, కార్లో ఉన్న యితర పెద్ద మనుషులకూ సంగతేమిటో దగ్గరకు వస్తేగాని అర్థం కాలేదు.

ప్రెసిడెంటు కారు జనం మధ్యకు వచ్చి ఆగింది. కారు చుట్టూ అంతా మూగిపోయేరు.

జనం 'ఎల్లయ్యమ్మ చావుకు కారణం సత్తేరావే' అని తిట్లకు రేగడ్డారు.

సత్తేరావు పెళ్లాం శవం మీద పడి, గుండెలు బాదుకొంటూ పొర్లి పొర్లి ఏడ్చేడు.

మున్సబు కరణాలు రిపోర్టు రాసి బారికాణ్ణి తాలూకా పోలీస్ స్టేషన్‌కు పంపించేరు.

శవం నీట్లో ఊరిపోయి చెడిపోయింది. ముక్కూ, పెదాలూ, కళ్లూ, కాళ్లూ, చేతులూ గోక్కుపోయి ఏవీ వాటి ఆకారాల్లో లేవు. చేపల్లూ, పురుగుల్లూ, నక్కలూ పీక్కుతినేసి

హెడన్సా




మూలవ్యాధుల నుండి త్వరితగతిని నిరపాయముగ నివారణ కలిగిస్తుంది

హెడన్సా లో పూర్ణజ్ఞానము పోగొట్టు మందులేవి లేవు—బిట్టలకు మరకకాదు.

DZ-1285 TG

లాభదాయకమైన లఘుపరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీరపరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో ఉన్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమనుగూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడిపదార్థాలు లభించేచోట్లు, ముడిపదార్థాల కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం—ఇందులోఉన్నాయి. లఘుపరిశ్రమలు ప్రారంభించ దలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కారమార్గాలు ఇందులో ఉన్నాయి. పుటలు 878, సుమారు 800 బొమ్మలు, ధర రూ. 13. తపాలా రుసుం రూ. 1—50, ఫోన్ నం: 229835.

COTTAGE INDUSTRY, (AWN-4) P.B. 1262, Jamuna Road Delhi-6.

పట్టున్నాయి. ఎన్నిరోజులై పోయిందో ఏమో! యీ రోజు గంటావాడి ధర్మమా అని బయటపడింది.

"ఏడి సే వి నా బం! దానుసురోసుకున్నావు. నెగునెగు" అని పెద్ద మనుషులు శవం మీదపడి ఏడుస్తూన్న సత్తెరావును పట్టుకొని బలవం తంగా లేవదీసేరు.

కుళ్లిపోయిన శవం ముక్కలు బద్దలు కొడు తూంది. కొంతమంది జనం అసహ్యంతో ఏవ గించు కొంటున్నారు.

సత్తెరావు కది కంపుగా కనపళ్లేదు. తను పెళ్లాంతో సుఖంగా గడిపిన మంచి రోజుల్ని తలచుకొని కుమిలిపోతున్నట్టున్నాడు. ముచ్చ టగా మొగుడూ పెళ్లాం తిరిగిన ఘడియలన్నీ కళ్లముందు బొమ్మల్లా మెరుస్తున్నట్టున్నాయి. ఆడదాన్లా నెత్తి బాదుకొని రాగాలు తీస్తూ రోదిస్తున్నాడు.

ఇనస్పెక్టరు, సబినస్పెక్టరు, పోలీసులు జీపు కారేసుకొచ్చారు. తనిఖీ అయిపోయింది. డోలీ కట్టించి శవాన్ని పట్నం తీసుకెళ్లి పోస్టుమార్టెమ్ చేయించేరు. ప్రెసిడెంటు మాట మీద పంచా యతీదార్లంతా ఎల్లయ్యమ్మ ఆత్మహత్య చేసు కొన్నట్టు పంచాయతీ తీర్పిచ్చేరు. ఎల్లయ్యమ్మ తండ్రి పోలీసుల కనుకూలంగా చెప్పలేదు. అందుకే ఆత్మహత్య స్థిరపడిపోయింది. కేసు దాఖలు చెయ్యలేదు. శవాన్ని తీసుకొని వల్లకాట్లో దహన పర్చేశారు.

మునసబు కరణాల రిజిష్టర్లో ఎల్లయ్యమ్మ అపసవ్యంగా చచ్చిపోయినట్టు రాసుకొన్నాడు. సత్తె రావు పెళ్లాం బుగ్గెత్తిపోసి దిన వారాలు పెట్టేడు.

ఎల్లయ్యమ్మ పునిస్త్రీ కదూ!

పంచాయతీ పెద్దలంతా ఊళ్లో గడపకో అర్ధా, పావలా చొప్పున చందా దండి, చెరువు గట్టు మీద యిటుకలు పేర్చి గుండం కట్టిం చేరు.

ఎల్లయ్యమ్మ పేరంటాలు గుండానికి వెళ్లే యించేరు. ఊరంతా పసుపు కుంకాలు చెల్లిం చేరు.

సత్తెరావుకు ఎత్తిపోతలకెంతో డబ్బు అవక పోయినా పై ఖర్చు లెక్కువై పోయినాయి. ప్రెసిడెంటు దగ్గర మడి చెక్క తాకట్టెట్టి మూడు వేలుచ్చుకొంటే హారతి కర్పూరం లాగ హరించి పోయింది. డబ్బుపోతే పోయింది గాని, బంగారం కంటే ఎన్నికైన పెళ్లాం పోయింది. దాని చావుకు ప్రత్యక్షంగా కాక పోయినా పరో క్షంగా తనే కారణం. తనకెవరున్నారు? ఎవరూ లేరు.

కన్న తల్లీ, తండ్రీ ఎప్పుడో చచ్చిపోయేరు. తోడబుట్టిన తమ్ముడు సుందర్రావును చదువు కోసం పట్నం పంపిస్తే చదువు వంట బట్టక పటాలంలో చేరిపోయేడు. చేరిన వాడు యిటు తిరిగి చూడడు సరికదా, ఉత్తరం ముక్క కూడా రాయడు.

ఊరంతా తన్నుభూతాన్నిచూచినట్టు చూస్తు న్నారు. 'ఇక ఎందుకీ యిల్లూ, వాకిలీ, ఊరూ, వార్డూ, బోర్డూ, బోర్డు మెంబరు గిరీ! ఇవన్నీ వదిలేసి వన్యాముల్లో కలిసిపోతే మంచిది' అను కొన్నాడు సత్తెరావు.

దిన వారాలయిన తరువాత మావ సుక్కెల్నాయ ఇంటికి వెళ్లిపోతూ సత్తెరావును రమ్మన్నాడు. ఏ ముఖం పెట్టుకొని యింకా అత్తవారింటికి వెళ్ల గలడు? వెళ్లలేడు. గుమ్మం ముందు అరుగు మీద ముడుకుల్లో కాళ్లు పెట్టుకొని తెగని ఊహలతో బుర్రకొట్టుకొంటున్నాడు.

పరాగంతో కలిసి ఆకాశం అంతా మబ్బేసింది. ఎటుచూచినా చీకట్లు కమ్మేసి ఉరుములతో ప్రళయం లాగ ప్రకృతి భయపెడుతూంది. మనసులో చీకటి! వీధిలో చీకటి! యింట్లో చీకటి! 'యీ చీకటికి దీపం వెలిగించే దిక్కు లేకుండా అయిపోయింది' అనుకొన్నాడు సత్తె రావు.

బయట వర్షం పడలేదు. గాలికీ ధూళికీ లేచిన మేఘం కాస్తా చెదిరిపోయింది. మేఘంతో పాటు చీకటి మాసిపోయింది. అస్తమించబోయే సూర్యుడు జిగేల్‌మని మెరిసి కనిపించేడు. ఆ వైపునుంచి ఎండ వాలుగా తూరుపుకు పడింది. ఆ వెలుతురుతో జట్కాబండి వచ్చి సత్తెరావు గుమ్మం ముందు జబర్దస్తీగా ఆగింది.

సత్తెరావు తలెత్తి చూసేడు. జట్కా వెనుక జనం సోల్జర్లలాగ ఛాతీలు విరుచుకొంటూ వచ్చేరు. ఊళ్లో చిన్నపిల్లలందరూ కోతుల్లాగ గెంతుకొంటూ అరచుకొంటూ బండిచుట్టూ మూగిపోయేరు.

జబ్బు మనిషి చుక్కెల్నాయ జట్కా వాడిని ఊత పట్టుకొని బండి దిగేడు. ఆయన వెనుక సత్తెరావు తమ్ముడు సుందర్రావు, పటాలం సిపాయి దుస్తుల్లో దిగేడు. అతని వెనుక పెద్ద కూతురు ఎల్లయ్యమ్మ దిగింది! ఎల్లయ్యమ్మ! సత్తెరావు భార్య! చెరువులో పడి చచ్చిపోయిం దనుకొన్న పెళ్లాం! దహనపర్చేసి, దినవారాలు చేసిన పెళ్లాం ఎల్లయ్యమ్మ బతికి ఎదురుగుండా కనబడేసరికి మెంబరు సత్తెరావుకు నోట మాట రాలేదు.

ఎల్లయ్యమ్మ "బావా!" అని దగ్గరి కొచ్చింది.

"ఎల్లా" అని సత్తెరావు ఎల్లయ్యమ్మను గట్టిగా కౌగలించుకొని అంతమంది జనంలోనూ తన్ను తాను మరిచిపోయి గిరగిరా చేతులు పట్టుకు తిప్పుతే ఎల్లయ్యమ్మ సిగ్గుతో తలవంచుకొంది.

తమ్ముణ్ణి కౌగలించుకొని ముద్దుపెట్టు కొన్నాడు సత్తెరావు.

ఊరంతా ఏకగ్రీవంగా ఒప్పుకొని అగ్నిపాలు చేసిన మెంబరు పెళ్లాం ఎల్లయ్యమ్మ ఊరం దరి ఎదుటా నిలబడింది.

మరణాల రిజిష్టర్లో పేరు రాసేసుకొన్న మున్సబు నాయుడుకేంచెయ్యాలో తోచలేదు. గుండానికి పెట్టిన పేరు చెల్లుబాటుకావడంలేదు. ప్రెసిడెంటుతో సహా ఊళ్లో పెద్దలంతా



మ మ త

చిత్రం — కదార్ల శేషయ్య (మిర్యాలగూడ)

సత్తెరావు ఇంటికొచ్చి ఎల్లయ్యమ్మను కళ్లారా చూసేరు. ఇన్నాళ్లూ ఎక్కడ ఉన్నదీ తెలుసు కొన్నారు.

ఆ రాత్రి చీకట్లో ఎల్లయ్యమ్మ జాగా వదిలి తిన్నగా ముక్కుకు సూటిగా వెళ్లింది. అలా వెళ్లగా రైల్వే స్టేషన్ కనుపించింది. అందులో రైలు గాడీ కనిపించింది. దానికింద పడిచద్దా మనుకుంది. అంతలో అదృష్ట వశాత్తు రైలు గాడీ దిగిన మరది సుందర్రావు కనిపించేడు. వదిన చెప్పినదంతా విని, జరిగినదానికి కోపంతో ఉగ్రుడైపోయి అన్న సత్తెరావును చంపుతా నన్నాడు. రైఫిల్ గుండేసి కాలుస్తానన్నాడు. ఎల్లయ్యమ్మ తప్పని అతన్ని వారించింది. చెల్లెలు నూకాలు జాడ తెలుసుకోవాలని పట్టుబట్టింది.

ఇద్దరూ ఇట్నా ఊళ్లోకిరాకుండా రైలెక్కి చెన్నపట్నం వైపు వెళ్లేరు. చెన్నపట్నం అంతా గాలించి నూకాలుకోసం వెదికేరు. ఆఖరికి నూకాలు జాడ తెలిసింది. తెలిసి రంగమ్మ డిపోకు వెళ్లి కనుక్కొంటే పక్షం రోజుల క్రిందటే నూకాలు తప్పించుకొని పారిపోయిందని తెలిసింది. చెన్నపట్నం వదిలి ఎల్లయ్యమ్మ కనిగిరికి వచ్చింది: నూకాలు యింటికే రాలేదు.

యింతకూ చెరువులో పడి చచ్చిపోయిన మనిషి ఎవరో, కట్టేసిన ఎల్లయ్యమ్మ పేరం టాలు గుండానికేం పేరు పెట్టాలో ఎవరూ వెంటనే సరిగా చెప్పలేకపోయారు.

బహుశా ప్రెసిడెంటు రాజగోపాల్రావుకు ఎవరు చనిపోయిందీ, ఎలా చనిపోయిందీ తెలిసుండ వచ్చు,

అయినా అతనెవరికీ ఆ విషయం చెప్పడు కదా! ★